ఎవరొస్తారో?

ఓయూ వీసీ నియామకంపై ఉత్కంఠ



ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా ఎవరొస్తారోనని వర్సిటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యావేత్తలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. క్యాంపస్‌లో కొత్త వీసీ రాకపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వీసీ పోస్టు కోసం 93 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకోగా అందులో సగానికి పైగా విశ్రాంత అధ్యాపకులే ఉన్నారు. ప్రస్తుతం ఓయూలో ప్రధాన సమస్య అధ్యాపకుల కొరత. గతంలో ఓయూలో 1257 పర్మనెంట్ అధ్యాపకులు పని చేయగా ప్రస్తుతం 372 మంది మాత్రమే ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు వీసీలు పనిచేసినా ఒక్క పోస్టును కూడ భర్తీ చేయాలేదు. ప్రభుత్వం మారిన అనంతరం కొత్త సీఎం రేవంత్ రెడ్డి వర్సిటీల అధ్యాపకుల పోస్టులను భర్తీ చేస్తారనే నమ్మకంతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. అయితే ఓయూలో అన్ని వర్గాల ఒత్తిడిని తట్టుకొని అధ్యాపక ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేసే సత్తా గల ప్రొఫెసర్ ఓయూకు అవసరం అని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

బోనాల జాతరకు రండి

మంత్రి పొంగులేటికి ఆహ్వానం



మంత్రి పొంగులేటికి బోనాల జాతర ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ, నల్ల పోచమ్మ బోనాల జాతరలో రాష్ట్రప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆలయ నిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఛైర్మన్ గుంటి కృష్ణ, పాలక మండలి సభ్యులు శనివారం మంత్రి పొంగులేటిని కలిసి పత్రికను అందించి చిలకలగూడ బోనాల జాతరకు రావాలని ఆహ్వానించారు. చిలకలగూడ కట్టమైసమ్మ బోనాల జాతర ఈనెల 28,29 తేదీల్లో నిర్వహిస్తున్నామని, లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని వివరించారు. ఈఓ మహేందర్‌గౌడ్, ఏసీ సంధ్యారాణి, ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ గుంటి కృష్ణ పాల్గొన్నారు.

వీసీలను నియమించాలని సీఎంకు బహిరంగ లేఖ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు పర్మనెంట్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ శనివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వర్సిటీలలో వీసీల నియామకంలో జాప్యం కారణంగా పాలన అస్తవ్యస్తమైందన్నారు. పారదర్శకంగా వీసీలను నియమించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

లక్ష్య కళాశాల విద్యార్థికి జాతీయ స్థాయి ర్యాంక్

సాక్షి, సిటీబ్యూరో: సీఏ ఇంటర్ లో జాతీయ స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన ఎస్ఆర్ నగర్ లోని లక్ష్య కళాశాల విద్యార్థి తరుణ్ కుమార్ రెడ్డి ని కళాశాల ప్రతినిధులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మురళి వైట్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి, పట్టుదల క్రమశిక్షణ విజయానికి మార్గం సుగమం చేస్తాయనడానికి విద్యార్థి తరుణ్ నిదర్శనమని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే తలసాని



బన్సీలాల్‌పేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి బన్సీలాల్‌పేట్ డి క్లాస్, బండమైసమ్మనగర్ బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు విన్నవించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, ఈఈ సుదర్శన్, జలమండలి డీజీఎం శశాంక్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన



కేశవమెమోరియల్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని రెండు పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పరిసరాల పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పిల్లలకు అవగాహన కలిగించారు. ఇంటి చుట్టుపక్కల, ఇంటిపై కప్పుపైన నిటినిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంట్లో వినియోగంలోలేని వస్తువుల నిల్వలు ఉండరాదని వివరించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించి డెంగీ తదితర విషజ్వరాలు ప్రబలకుండా పాటుపడతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీతాఫల్‌మండిలోని వేదిక్ విద్యాలయం, మధురానగర్‌లోని కేశవ విద్యాలయం పాఠశాల్లో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో జీహెచ్‌ఎంసీ మెడికల్ ఆఫీసర్ రజనీకాంత్, ఎంటమాలజీ విభాగం అధికారులు శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం మెహిందీ ఉత్సవాలు, ఎల్లోకలర్ డే వేడుకలు సందడిగా జరిగాయి. విద్యార్థులు ఎల్లోకలర్ డ్రెస్సుల్లో ఉత్సాహంగా కనిపించారు. పాఠశాల ఆవరణలో అరటి పండ్లు, నిమ్మకాయ, మామిడిపండ్ల వంటి ఫ్రూట్స్‌తో సందడి చేయడం కనిపించింది. అదే విధంగా ఆషాడమాసం సందర్భంగా చిన్నారులు గోరింటాకు ఉత్సవాలు నిర్వహించారు.



పేపర్ బ్యాగులపై అవగాహన కార్యక్రమం



లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం పేపర్ బ్యాగ్ అవేర్‌నెస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగులను స్థానికంగా ఉన్న పలు సూపర్ మార్కెట్‌ల వద్ద ప్రజలకు అందజేశారు.

బీసీ కమిషన్ ఏర్పాటు తర్వాతే కులగణన



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్రంలో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి వెంటనే కులగణన ప్రక్రియను ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు బీసీ సమాజాన్ని సామాజికంగా రాజకీయంగా జాగృతం చేస్తూ బీసీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. శనివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్ర కులగణన చేపట్టకుండా రిజర్వేషన్ వ్యతిరేకులు చేసే కుట్రలను బీసీలు తిప్పికొట్టాలని కోరారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ గ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, నందగోపాల్, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రం.. నడవదిక!



- ఆదాయం పెంపుదిశగా జీహెచ్‌ఎంసీ అడుగులు
- ట్యాక్స్ మదింపు కార్యక్రమానికి శ్రీకారం
- రాబడిని పెంచుకునేలా జీహెచ్‌ఎంసీ అధికారుల కసరత్తు

కొందరు భారీ ఎత్తున వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ జీహెచ్‌ఎంసీకి మాత్రం నామమాత్ర పన్నులు చెల్లిస్తున్నారు. దీంతో అధికారులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి ఆదాయ మార్గాలపై అన్వేషణ ప్రారంభించారు. స్థల విస్తరణ, కార్యకలాపాలు ఆధారంగా ట్యాక్స్‌ను నిర్ధారించనున్నారు. రెసిడెన్షియల్ ఆధారంగా ట్యాక్స్ చెల్లిస్తూ వ్యాపార కార్యకలాపాలను వినియోగించే భవనాలకు ట్యాక్స్‌లను పెంచుతారు. 'సుమోటో అసెస్‌మెంట్' కార్యక్రమంలో పేరిట ట్యాక్స్ మదింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. – బన్సీలాల్‌పేట్

- నామమాత్రంగా ట్యాక్స్‌ను చెల్లిస్తున్న భవనాలను అధికారులు గుర్తించారు. ఇందులో వాణిజ్య, నివాసం వంటి వాటిని సేకరించి దేనికి ఎంత పన్నుల రూపంలో ట్యాక్స్‌ను వసూలు చేయాలనే జీహెచ్‌ఎంసీ ట్యాక్స్ విభాగం అధికారులు నిర్ణయించారు.
- ట్యాక్స్ చెల్లింపు కార్యక్రమాన్ని హేతుబద్ధం చేస్తూ భారీ ఎత్తున ఆదాయాన్ని రాబట్టేందుకు అధికారులు పెద్ద కసరత్తే చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లు విస్తరించి ఉన్నాయి.
- డివిజన్లను ట్యాక్స్‌ను అప్‌డేట్ చేసే పనిలో సిబ్బంది పని చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఏఎంసీ స్థాయిలో అధికారులు బిల్లు కలెక్టర్ ఇతరత్రా సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సుమారు 3వేల వాణిజ్య, నివాస ప్రాంతాలను గుర్తించినట్లు సమాచారం.
- అనేక ప్రాంతాల్లోని భవనాలకు ఎన్నో ఏళ్ల క్రితం నిర్ధారించిన ట్యాక్స్‌ను మాత్రమే చెల్లిస్తున్నారు. దీని వల్ల జీహెచ్‌ఎంసీకి అంతంతమాత్రంగానే ఆదాయం సమకూరుతోంది. ఆదాయాన్ని మరింత పెంచుకొని జీహెచ్‌ఎంసీ ఆర్థికంగా బలోపేత చేయడానికి అధికారులు పెద్ద కసరత్తు చేస్తున్నారు.
- సుమోటో అసెసెమెంట్ విధానం అమలు ద్వారా జీహెచ్‌ఎంసీకి భారీ ఎత్తున ఆదాయం సమకూరుతుందని అధికారులు భావిస్తున్నారు.
- ఆర్పీరోడ్డు, ఎంజీ రోడ్డు, జీరా, పద్మారావునగర్, బన్సీలాల్‌పేట్, మోండా మార్కెట్, పాట్‌మార్కెట్, బేగంపేట్, పీజీ రోడ్డు, మినిష్టర్ రోడ్డు, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ తదితర ప్రాంతాల్లోని భారీ ఎత్తున వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ జీహెచ్‌ఎంసీకి మాత్రం నామమాత్రంగా ట్యాక్స్‌లను చెల్లిస్తున్నారు.
- పాత పద్ధతికి స్వస్తి చెప్పి ప్రస్తుతం స్థల విస్తరణ, కార్యకలాపాలు ఆధారంగా ట్యాక్స్‌ను నిర్ధారిస్తారు. రెసిడెన్షియల్ ఆధారంగా ట్యాక్స్ చెల్లిస్తూ వ్యాపార కార్యకలాపాలను వినియోగించే భవనాలకు ట్యాక్స్‌లను పెంచుతారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని నివాసిత, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి 213 కింద నోటీసులు కూడా జారీ చేసినట్లు ఏఎంసీ వి. కుమార్ చెప్పారు.
- భారీ భవనాలు ఉండి, తక్కువ ట్యాక్స్‌లు చెల్లిస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటూ ఆదాయాన్ని సమకూర్చుకునే వ్యాపారస్తుల ట్యాక్స్‌లు పెరుగుతాయని అధికారులు అంటున్నారు.
- బేగంపేట్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 100కోట్లను ట్యాక్స్ రూపంలో సేకరించారు. నిర్దేశించిన లక్ష్యం 87కోట్లు కాగా 100 కోట్ల రూపాయల ట్యాక్స్‌లను వసూలు చేశారు. అంటే 14.5శాతం లక్ష్యానికి అదనంగా వసూలు చేశారు.
- ట్యాక్స్ వసూళ్ల ద్వారా బేగంపేట్ సర్కిల్ అధికారులు తమ పనితీరును నిరూపించుకున్నట్లయింది. ఎప్పటికప్పుడు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ట్యాక్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ట్యాక్స్ వసూళ్ల నిర్ధిష్ట లక్ష్యాన్ని అధికమించారు.

ఇప్పటికే పలు భవనాలను గుర్తించాం ట్యాక్స్‌ల చెల్లింపు కార్యక్రమాన్ని హేతుబద్ధీకరిస్తున్నాం. ఏళ్ల తరబడి అనేక భవనాలకు పాత పద్ధతిలో నామమాత్రంగా ట్యాక్స్‌లు చెల్లిస్తున్నారు.. అలాంటి భవనాలను గుర్తించి ట్యాక్స్ విధానాన్ని క్రమబద్ధీరిస్తున్నాం.. ఇప్పటికే సర్కిల్ పరిధిలో అనేక నివాసిత, వాణిజ్య భవనాలను గుర్తించాం..ఈ విషయంలో భవన యజమానులు జీహెచ్‌ఎంసీకి సహకరించాలి. – సమ్మయ్య, డిప్యూటీ కమీషనర్

నేటి నుంచి పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలతో పాటు తొలి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి: వానాకాలంలో లోతట్టుప్రాంతాలలో వరద సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లోని టీఆర్టీ జవహర్‌నగర్ మెయిన్ రోడ్డు వద్ద వరద సమస్య పరిష్కారానికిగాను రూ.50 లక్షలతో చేపట్టిన కచ్చానాలా పైప్‌లైన్ పనులను రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వరద నీటి సమస్య వున్న ప్రాంతాలను గుర్తించి కార్పొరేటర్ తమ దృష్టికి తేవాలని, అందుకు కావాల్సిన సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ముఠా గోపాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నేతలు పూసరాజు, రమేష్‌రామ్, రత్నసాయిచంద్, డీఈ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హిమాయత్‌నగర్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ వారు అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఐపీఎస్ అధికారి ఐజీ సత్యనారాయణ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎన్నుకున్న విద్యార్థి మండలి, ఆఫీస్ బేరర్ల వార్షిక ఇన్వెస్టిట్యూర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఐజీ సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాల స్థాయిలోనే కాకుండా ప్రభుత్వంలో కూడా మంత్రివర్గంలో సభ్యులుగా ఉండేలా కషి చేయాలన్నారు. నాయకత్వ లక్షణాలు, స్వీయ, క్రమశిక్షణ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, సి.బి.ఎస్.ఇ డివిజన్ నుంచి స్కూల్ కెప్టెన్లకు బ్యాడ్జీలను అందజేశారు.

28న అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: భారతదేశంలో పురాతనమైన సాంప్రదాయ వైద్య విదానాలతో అనేక రోగాలను రూపుమాపవచ్చని ది హోలిస్టిక్ మెడిన్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శనివారం సికింద్రాబాద్ పీజీరోడ్‌లోని సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ దీపక్‌రౌత్, బిర్లా ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ జాన్సీరాణి, డాక్టర్ వంశీకృష్ణ, ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా నాగశ్రీ, సామాజికవేత్త డాక్టర్ శ్రీనివాస్, ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ క్రైమ్ కంట్రోల్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింగ్‌రావు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి 108 రకాల సాంప్రదాయ వైద్య విదానాలు అందుబాటులో ఉన్నా ప్రజలు వాటిని వినియోగించడం లేదన్నారు. ప్రపంచంలోని అనేక మంది వైద్యులతో ఈ నెల 28వ తేదీన సాంప్రదాయ వైద్యంపై 4వ ప్రపంచ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎవరూ పట్టించుకోరు

ఉదయ్‌నగర్ కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే



ఉదయ్‌నగర్ కాలనీలో...

సనత్‌నగర్: అసలే వర్షాకాలం..సీజనల్ వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం.. ఒకవైపు దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన..అయినా శానిటేషన్ సిబ్బందిలో మార్పు రావడం లేదు. ఉదయ్‌నగర్ కాలనీలోని పలు రోడ్లను చూస్తే అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. గత రెండు నెలలుగా చెట్ల కొమ్మలు, వ్యర్థాలు పేరుకుపోతోన్నా వాటిని తొలగించే వారే కరువయ్యారు. ఈ విషయంపై పలుమార్లు శానిటేషన్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెట్ల కొమ్మలు ఉంటే తమకు సంబంధం లేదంటూ శానిటేషన్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చెట్ల వ్యర్థాలు నెలల తరబడి అలాగే ఉండడంతో రానురాను డంపింగ్ కేంద్రంగా మారిపోతున్నాయి. ఇదిలా ఉంటే ఉదయ్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్ గోడను ఆనుకుని చెత్త డంప్ చేస్తుండడంతో స్థానికంగా తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. పక్కనే ఆనుకుని ఉన్న శ్యామలకుంట బస్తీ నివాసితులు ఇక్కడ చెత్తను పడేస్తున్నారని ఉదయ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. శ్యామలకుంట బస్తీ నుంచి చెత్తను సేకరించే వాహనాలు లేకపోవడంతో గత్యంతరం లేక వారు చెత్తను ఇక్కడే పడేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కమ్యూనిటీ హాల్‌లో ఏవైనా కార్యక్రమాలు చేసుకోవాలంటే చెత్త దుర్గంధంతో అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇక్కడ చెత్త డంపింగ్ కేంద్రాలను తొలగించాల్సిందిగా స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో .. టమాటా కిలో రూ.51, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 65, పచ్చ కాకర 48, పందిరి బీర 32, క్యాబేజీ 37, క్యారెట్ 32, దొండ 35, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 19, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఖాళీస్థలాలను చెత్తరహితంగా మార్చాలి

కాచిగూడ: మహానగరంలో వేలాది ప్రైవేట్, ప్రభుత్వ ఖాళీస్థలాలు మురికి కూపాలుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయాయని, దానివల్ల భూగర్భజలాల కలుషితం తారాస్థాయికి చేరుతోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వర్షాలు సమీపిస్తున్న వేళ తక్షణమే ఆయా స్థలాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పితే ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో ఆ స్థలాల్లో చెత్త చిన్న పిల్లల ఆరోగ్యానికి తీవ్ర ప్రభావానికి గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామీణ కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి

ప్రొఫెసర్ కోదండరాం



మూలం సంత ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొ కోదండరాం

లాలాపేట: ఆరోగ్యాన్ని పెంచి ఉద్యోగాన్ని కల్పించే కుటీర పరిశ్రమలను పోత్సహించాలని ప్రొ.కోదండరాం అన్నారు. గ్రామ భారతి 28 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం తార్నాకలోని మర్రి కృష్ణా ఫంక్షన్ హాల్లో 'మూలం సంత' (లెట్స్ గో బ్యాక్ టు రూట్స్)ను ఏర్పాటు చేశారు. దీనికి ప్రొ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 45 మంది రైతులు, గో, వ్యవసాయాధారిత ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు.

8వ రోజుకు చేరిన బస్తీబాట



అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో బస్తీబాట నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

అడ్డగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'బస్తీబాట' కార్యక్రమం శనివారం 8వ రోజుకు చేరింది. అడ్డగుట్ట ఏ సెక్షన్‌లో నిర్వహించిన బస్తీబాటకు ఆ పార్టీ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరయ్యారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, బాలయ్య, గోపాల్, మధు, ఎల్లయ్య, షేక్ ఫాతిమా, శానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



బ్లాక్ డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ఆగస్టు 10న నిర్వహించనున్న దళిత క్రైస్తవుల చలో ఇందిరాపార్కు కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు పిలుపునిచ్చారు. శనివారం అమృతవాణి భవనంలోని ఏఐసీఎఫ్ కార్యాలయంలో సంఘం ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దపాటి విజయరాజు మాట్లాడుతూ నాటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ ఉత్తర్వులతో 74 సంవత్సరాలుగా దళిత క్రైస్తవులు ఎస్సీ హోదాను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోయారని అన్నారు.

మైనార్టీ మోర్చా కన్వీనర్‌గా కిరీట



కిరీటకు నియామకపత్రం అందజేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: బీజేపీ మైనార్టీ మోర్చా సనత్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన ఊట్ల కిరీటా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ నియామక పత్రం జారీ చేయగా శనివారం సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కిరీటా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. అందుకు నిదర్శనం మహిళా బిల్లు విజయం సాధించడమేనన్నారు.

ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సమితి నేత సుల్తాన్ యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోయపల్లి రంగారెడ్డి అధ్యక్షతన శనివారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమకారుల సేవలను అన్ని విధాలుగా వాడుకొని వారిని విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ మానిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం ఇచ్చి 4 గదుల ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, ప్రతి నెల రూ.30 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్య బీమా రూ.20 లక్షల వరకు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు ప్రఫుల్ రామిరెడ్డి, కేసీఎస్ ప్రసాద్, ఎం.వెంకటస్వామి, కె.వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 15వ తేదీన ఉదయం 10:30 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సుల్తాన్ యాదగిరి తెలిపారు.

సైకాలజిస్టుల సేవలు అభినందనీయం

హిమాయత్‌నగర్: మానసిక ఆరోగ్యానికి చికిత్స అందిస్తున్న సైకాలజిస్టుల సేవలు అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టి.పి.ఎ అవార్డ్స్ ప్రదానోత్సవానికి వేణుగోపాల చారి హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, మహిళలు, పురుషులు ఎంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దైనందిన జీవితంలో మానసిక ప్రశాంతత కోసం యోగా చేయాలని సూచించారు. సంఘానికి చెందిన 15 మంది మహిళా సైకాలజిస్టులకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ ఉమెన్ సైకాలజిస్ట్ అవార్డ్, 10 మంది సైకాలజిస్టులకు తెలంగాణ ఇన్‌స్పైరింగ్ సైకాలజిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు.